# దీపావళి జ్యోతి

"నెమలి"

ఆరోజు దీపావళి. ఊరంతా పండుగరోజే. ఎటుజూచినా టపాకాయలు 'పటపట' మనుచు 'ఢాం ఢాం' మనుచున్నవి. ప్రతియింట్లోనూ చిన్నపిల్లలూ, పెద్దపిల్లలూకలసి ఆటలేమి? పాటలేమి? ఇక వారి సంతోషానికి, యుత్సాహానికీ, మేమేం తీసిపోయ్యామన్నట్లు చిచ్చుబుడ్లు చిట్లుమంటూ, తారాజువ్వలు బుస్సు బుస్సుమంటూ, ఆకాశానికి గంతులేస్తున్నాయి. ఎటుజూచిననూ ఆనందసాగరములో మునిగి తేలువారే! అదేమి చిత్రమోకాని, ఆ ఊరిబయట మౌనంగా కూర్చున్నవారెవరు? ఇంకెవరు? మనదేశంలో సంఖ్యకుమీరి పెరిగిపోవుచున్న ఆ నిరుపేదలలో ఒక కుటుంబమ్మలేవారు! పాపమూకాశంలో మినుక్ మినుకనుచున్న ఆ నక్షత్రాలుదప్ప మరెవ్వరూ వారిని గమనించరుకదా! రండి బాలలూ దగ్గరకుపోయి చూతము వారెవరోమరి. అదిగో, ఒకమ్మ తనచేతిలో చిట్టిపాపను పట్టుకొని జోలపాడ్తూంది, తనకుతెలిసిన మౌనిరాగంలో. పాపం! దాని కండ్లమ్మట యెలా నీళ్లుకారుతున్నాయో. అబ్బ! అదిపడేకష్టాలేమిటో? ప్రక్కనే ఓ చిన్నమ్మాయి యెలా చతికిలబడిందో కాళ్లూచేతులూ కదలించకుండా. ఆ అమ్మాయి చలిలో వడకిపోతున్నా కప్పుకొందుకు చిఱిగిన పేలికన్నాలేదు. ప్రక్కనేకూర్చున్న తన అన్నతో యేమిటో మాట్లాడుతూంది. బాలా! విందామా? "అన్నా యీపొద్దు దీపావళికదూ! మరి నాకప్పచ్చులు, టపాకాయలూ తెచ్చావా?" పిచ్చిపిల్ల! పాపం వాళ్ళన్నెక్కడనుంచి పట్టుకొస్తాడు? అయినా, అతడేం చెప్తాడో విందాం.

"ఇదో తెస్తాగా. మరేం నలుగురింటికాడకెళ్ళి పట్టుకొస్తానమ్మా. నువ్వూతిందువుకాని." ఎంత అమాయకుడతను. అడగంగానే పెడ్తారా? అదో అ అమ్మతో ఏదోచెబుతున్నాడు. 'అమ్మా, నేనెల్లి చెల్లికి అప్పచ్చులు పట్టుకొస్తానే. నీవూ అదీ యీడే వుండండి. అనిచెప్పి లేచాడు. ఇటూఅటూ బారజూచి గబగబా వూరివైపు నడవడం మొదలెట్టాడు.

అతడు నడిచివెళ్ళేలోగా మనమా కనబడే యింటిలోజొరబడి, ఓ మూలదాగుండి ఏంజరుగుతుందో చూద్దాం. ఆయింటి తిన్నెమీద యెంతోచక్కగా దీపాలు వెలిగించారు. ఇల్లంతా లక్షదీపాలతో కలకళ్ళాడుతోంది. ఆ యరుగుమీదే యిన్ని టపాకాయలుపేర్చి యిద్దరుపిల్లలు నవ్వుకుంటూ కాలుస్తున్నారు. ఓఅమ్మాయీ, ఓఅబ్బాయీని, వాళ్ళమ్మ వెనకేనుంచుని జాగ్రత్తగా కనిపెడుతూంది. మరి వాళ్ళ నాన్నేమో పెద్దచిచ్చుబుడ్లూ అవీ కాలుస్తూ వారికానందం కలిగిస్తున్నాడు. ఎంత రమ్యమైనదృశ్యం! కాని ఆగు బాలా! ఆ తలుపు మెల్లగా తోసుకుంటూ లోనికివచ్చేదెవరు? అవును. చెల్లితో టపాకాయలు తెస్తానని చెప్పివచ్చిన అబ్బాయే! పాపం! వాడు వచ్చిందికూడా అక్కడివారెవరూ గమనించలేదు. అతడేమో యీ మధురదృశ్యం చూస్తూ తనచెల్లిని తలుచుకొని మెల్లగా కండ్లనీరుకార్చాడు. తరువాతెట్లో ధైర్యంతెచ్చుకొని మెల్లగా తండ్రిదగ్గరకువెళ్ళి "బాబుగారూ"! నాచెల్లి ఆకలితో ఏడుస్తూవుంది. కొద్దిగా బువ్వపెట్టించండి బాబుగారూ అని దీనంగా బ్రతిమాలాడు. ఆయన గ్రుడ్లుఉరుముతూ తలపైకెత్తి 'ఛీవెధవా! అవతలికిపో! ముష్టిముండావాడు తలుపుతోసుకుని ఎలావచ్చేశాడో. పోతావా లేక టపాకాయలు మీద పేలవనా? జాగ్రత్త! బువ్వట, బువ్వ!" టపాకాయలు పేలలేదన్నకోపమూ అమాయక బాలునిమీదనా చూపడం? ఈ ఎదురుచూడని బదులువినగానే ఆబాలునిగుండె చివుక్కుమన్నది. మరి మాటలాడలేక తలుపుతీసుకొని జారిపోయాడు.

ఇదంతా చూస్తూవున్న యిద్దరుపిల్లలూ యిలా మాట్లాడుతున్నారు.

అమ్మాయి:-ఏంరా! ప్రసాద్, మననాన్న యెలాచేశాడో చూశావా? పాపం వాడిచెల్లెలు ఆకలితో ఏడుస్తోందట, మనమేంచేద్దాంరా?

ప్రసాద్:- వూరుకోవే శారదా! నువ్వెందుకలా ఏడుస్తావు? అమ్మచూస్తే కోప్పడుతుంది. నువ్వు గుట్టుగా వెళ్ళి అమ్మదాచుంచిన అప్పచ్చులు పట్టుకరా. అవీ, కొన్నిటపాకాయలూ సంచిలోవేసి, తీసుకెళ్ళి ఆ అబ్బాయికిచ్చొస్తా. ఇంకేడవకు శారదా! వెళ్ళు మరి.

ఈ మాటలువినంగానే శారద తనకన్నీరు తుడిచేసుకొని లోపలకు పరుగెత్తింది. ఇంతలోకి వాళ్ళ నాన్న, అమ్మా భోజనానికి వంటయింట్లోకెళ్ళారు. శారద ఓ పెద్దసంచినిండా అప్పచ్చులుతీసుకొచ్చి తన అన్న చేతికిచ్చింది. అతఁడు టపాకాయలు చేతిలోపట్టుకొని బయటకు పరుగెత్తాడు. శారద వాళ్ళమ్మతో ప్రసాద్ ప్రక్కింటి రామంపిలిస్తే వెళ్ళేడనిచెప్పి తాను వాకిటిలోనే కూర్చుంది అన్నవస్తాడని. ప్రసాద్ చేతిలో సంచిపట్టుకొని యిటూఅటూ చూస్తూ అన్నిసందుల్లో వెళ్ళాడుగాని, ఆపిల్లాడుమాత్రం కనబడ లేదు. నిస్పృహతో తిరిగి వచ్చేస్తుంటే తనయింటిదగ్గరే ఆ అబ్బాయి నిలుచోడంచూచి పరుగెత్తుకుంటూ వెళ్ళాడు. కాని పాపం! సగందూరం వచ్చాడోలేదో రెండుమూడు పెద్దటపాకాయలు బుస్సు బుస్సు మంటూ భయంకరంగా వచ్చి అతనిమొహంమీదా గుండెమీదా పేలాయి. వొళ్ళంతా మండుకొని పోతూంది. 'అమ్మా! శారదా!' అని కేకలేస్తూ తన్ను రెండుచేతుల్తో గట్టిగాపట్టుకొన్న అబ్బాయి ఒడిలో మూర్ఛపోయాడు. తనమీదమంటలన్నీ అబ్బాయి చిఱిగినగుడ్డలకూ అంటుకొన్నాయి. కానీ ఆ అబ్బాయి ప్రసాదును అలాగేపట్టుకొని, తనదేహంకాలుతున్నా లక్ష్యపెట్టక, అతడ్ని మోయలేకమోస్తూ, యింటివాకిట్లో నివ్వెఱపోయికూర్చున్న శారదప్రక్కన పండబెట్టాడు.

ప్రసాద్ సంచిపట్టుకొని వెళ్ళినకొంతసేపటికల్లా వారినాన్నగారు బయటికొచ్చి, టపాకాయలు కాలవడం మళ్ళీ ప్రారంభించారు. ఓ కొత్తరకం టపాకాయ పెట్టిలోనుండితీసి, శారదవైపుతిరిగి, "అమ్మణ్ణీ చూశావా! యీ టపాకాయను. ఇవి రెండుమూడు ఒకేసారి భయంకరధ్వనితో పేలుతాయి! అని చెబుతూ వాటినిముట్టించారు. మరుక్షణం వీధినుండి 'అమ్మా! శారదా!' అన్నకేక. అవును, అయిదు రూపాయల టపాకాయలతో తనకుమారుని చంపుకున్నాడా దౌర్భాగ్యుడు! ఇదివిన్నశారద, "ప్రసాద్!" అని అఱచుచూ అలాగే చతికిలబడింది. అదో మండుతున్నదేదో వస్తున్నదిలోపలికి; అదిగో ఆ అబ్బాయి ఎవర్నో మోసుకొస్తున్నాడు. తన అన్నే! అబ్బా! నాన్న యలాపిచ్చివాడులా నుంచున్నాడు? మంట లార్పరాదూ. పాప మాఅమ్మాయి లోపలికెళ్ళి రెండురగ్గులనుతెచ్చి మంటలమీద వేసింది. అప్పుడే నాన్న పరుగెత్తుకుంటూవచ్చి యిద్దరినీ వాటిలోచుట్టి మంటలార్పేశాడు. కానీ ఏమిలాభం! మెల్లగాకండ్లుతెఱచి "నాన్నా...రూ - రూ - సంచి...ఆ...అ...అబ్బాయికివ్వండి. మన...యింట్లో...వుండమనండి. మళ్ళీ శారదా...దా... ఏఏడవకూ - నేను_వెళ్తున్నా... మళ్ళీ...కలుసుకొందాం - దీపావళొచ్చిందమ్మా... అని చెప్పుతుండగానే ఆ చిన్నబాలుని ప్రాణములెగిరిపోయినవి. బీదకుఱ్ఱాడు బ్రతికాడు. ఇంటిలోని దీపాలన్నీ యొక్కపెట్టున తీక్షణముగావెలిగి అన్నీ కొండెక్కాయి. దీపావళి వచ్చింది. ఆకాశంలోని నక్షత్రాల్లో మరియొక చుక్కకూడా చేరింది. మినుక్ మినుకంటూ యీ యింటివారినీ, ఏటిగట్టు మీది వారినీ చూచి ఓదారుస్తున్నట్లు కనబడింది. దీపావళివచ్చింది. దీపావళి వెళ్ళింది. దీవపాళి! జీవితజ్యోతిని బలిగాగొన్నది!

